ఎర్రరాయి ఉంగరం

- ఆర్.శ్రీనివాస్

(కౌముది-రచన నిర్వహించిన పోటీలో ఎంపికైన ఉత్తమ కథ)

దేవాలయంలో అర్చన ముగించుకుని, ప్రసాదం తీర్థం యధావిధిగా స్వీకరించి ప్రశాంతంగా ఉన్న ఓ మూల కూర్చున్నాం, నేనూ సుప్రియా.

ఈనాడే మా పెళ్ళి రోజు. కానీ నేను ఏ మాత్రం ఉత్సాహంగా లేను. సుప్రియా అంతే. కానీ తను నిండు కుండ, తొణకదు, బెణకదు. ఇంతకీ నా నిరుత్సాహానికి కారణం తెలియాలంటే కాస్త వెనక్కు వెళ్ళడం అవసరం.

మాది మిడిల్ క్లాస్ కుటుంబం. మా నాన్నాగారు స్కూల్ టీచర్‌గా రిటైరయ్యారు. రిటైరయ్యేసరికి ఆయనకు మిగిలింది అప్పుడే ఉద్యోగంలో చేరిన నేనూ, బి.ఏ ముగించిన నా చెల్లెలు గాయత్రినూ. మా అమ్మ నేను హైస్కూల్‌లో ఉండగానే మరణించింది. మా నాన్నగారి టి.పి.ఎఫ్ వగైరాలతో చెల్లి పెళ్ళి ఐందనిపించాం. ఐనా మా బావగారిది కాస్త కలిగిన కుటుంబం కావడం వల్ల పెట్టుపోతల విషయంలో కాస్త మాటపట్టింపులు వచ్చాయి. ఫలితం మా నాన్న ఆక్సిడెంట్లో మరణించినప్పుడు కూడా బావగారు చెల్లాయిని రెండు రోజులు మాత్రమే ఉండనిచ్చి అర్జెంట్ పనులున్నాయని తీసుకెళ్ళిపోయారు. పదవదినం తంతు చెల్లెమ్మ లేకుండానే ముగిసింది. అంతా చెవులు కొరుక్కున్నా పైకి మాట్లాడలేదు. గుండె రాయి చేసుకుని ఆ తంతు ముగించాల్సొచ్చింది.

తరువాత క్రమంగా ఒంటరి జీవితానికి అలవాటు పడ్డాను. కానీ శ్రేయోభిలాషులూ, మా నాన్నగారి స్నేహితులూ, ఈ విషయంలో చొరవ వహించి నన్ను పెళ్ళి చేసుకొమ్మని పోరుపెట్టి ఒప్పించారు.

నేను పెట్టిన షరతులు రెండు: పిల్ల పేదవాళ్ళ కుటుంబంలోంచే వచ్చుండాలి. రెండు: కట్నాల, లాంఛనాల ప్రసక్తి తేకూడదు.

సుప్రియ వాళ్ళ నాన్నకు ఆరుగురు కూతుళ్ళు. సుప్రియ రెండో కూతురు. వంశోద్ధారకుడి కోసం ఆరుగురు ఆడపిల్లల్ని కన్న ఆ చాదస్తపు గ్రుహస్తుణ్ణి చూసి నాకు జాలేసింది. కానీ సుప్రియతో కాస్సేపు మాట్లాడాక కష్టసుఖాలు తెలిసిన అమ్మాయిని గ్రహించి పెళ్ళికి ఒప్పుకున్నాను. పెళ్ళి అత్యంత క్లుప్తంగా జరిగిపోయింది.

పెళ్ళయి ఒక సంవత్సరం మాకు తెలియకుండానే గడిచిపోయింది. బహుశ కొత్తగా పెళ్ళయిన ఎవరికైనా అంతా అనుకుంటాను. తమాషాగా నా పెళ్ళికి మా బావగారు రాలేదు. చెల్లి మాత్రం వచ్చింది. బావగారికి ఆఫీసులో ఏదో ఇన్‌స్పెక్షన్ అని చెప్పింది కానీ, తర్వాత

విషయం తెలిసింది. ఇంత క్లుప్తంగా పెళ్ళి జరపడం సంప్రదాయం కాదట. పైగా తనెవరైనా పెళ్ళిలో చూస్తే తన బావమరిది పెళ్ళి ఇంత కనాకష్టంగా జరుగుతోందంటే తనకు నామోషీ అట.

నాకు ఒళ్ళు మండిపోయింది. కాని యధావిధిగా చెల్లి వెళ్ళేటప్పుడు కాస్త కాస్టీ గుడ్డలూ, రిస్ట్ వాచ్ పెట్టి పంపాను, రిస్ట్ వాచ్ పెట్టమన్న ఐడియా సుప్రియదే. చెల్లీ, సుప్రియా ఒక్కటిగా కలిసిపోవడం నాకెంతో రిలీఫ్‌గా అనిపించింది.

ఒక్కడుగా ఉన్న నేను ఇద్దరయాక కాస్త జాగ్రత్తగా ఖర్చు చేయడం నేర్చుకున్నాను. అదికూడా సుప్రియ చలవే. ఆఫీసుకు దర్జాగా ఆటోలో వెళ్ళేవాణ్ణి, శనివారాలు సెకండ్ షోలు తప్పని సరి. సుప్రియ అజమాయిషిలో ఇవన్నీ తక్కువైపోయాయి. తనూ అంతే. పైసా తనకోసం పెట్టుకునేది కాదు. ఒక్కసారి మల్లెపూలు తెస్తే "ఎందుకండీ, మూడు రూపాయలు పెట్టి మూర పూలు కొంటారు? అదే ఒకటిన్నర రూపాయికి మూడు గ్రాములు పూలు తెస్తే ఎంచక్కా కట్టుకోవచ్చు" అంది. ఒళ్ళుమండి "అలాగే, ఈ సారి ఓ బుట్టెడు మల్లెపూలు తెస్తా. రాత్రంతా మాల కడుతూ కూర్చుందువుగాని" అన్నాను. నా మూడ్ అప్సెట్ అవుతోందని గ్రహించి మాట మార్చేసింది. చీరలూ, నగలూ, వాషింగ్ మెషిన్ల సంగతి సరేసరి, పొరపాటున కూడా వాటి సంగతి రానిచ్చేదికాదు.

"మీ మిస్సెస్ చాల అనుకూలవతిరోయ్" అని మా మిత్రులందరూ తరచుగా కామెంట్స్ చేస్తూ ఉంటే అందులో అభిమానం, ఆప్యాయతలతో బాటు ఓ మూల కాస్తంత ఈర్ష్యకూడా దాగుందనుకుని నాలో నేనే మురిసిపోయేవాణ్ణి.

ఇలాంటి నా సుప్రియ ఓసారి నా ముందుంచిన కోర్కె నన్ను ఆశ్చర్యపరచింది. అది ఎర్రరాయి ఉంగరం కావాలని.

ఓ రోజు ఇంటికి ఆలస్యంగా వచ్చాను. సుప్రియ ఆ రోజు ఎందుకో సిగ్గుపడుతున్నట్టు గ్రహించాను. సుప్రియ ఎప్పుడూ నవలల్లో సినిమాల్లో హీరోయిన్‌లా కాలి వేళ్ళతో నేలను గీస్తూ, క్రీగంట చూస్తూ మాట్లాడదు. చాలా గంభీరంగా, అంతే ఆప్యాయంగా మాట్లాడుతుంది. అటువంటిది, ఈ రోజు ఏదో చెప్పాలనుకుంటూనే నసుగుతోంది. అంటే?

నా ఊహ నిజమే. నేను తండ్రిని కాబోతున్నాను. ఆనందం పట్టలేకపోయాను. మర్నాడు ఆఫీసుకి సెలవు పెట్టాను. ఇద్దరం ప్రొద్దుటే గుడికి వెళ్ళాం. తర్వాత సినిమా, ఆ తర్వాత హోటల్, ఇలా ఆరోజంతా క్షణంలా గడిచిపోయింది. మామూలుగా అయితే సుప్రియ ఖర్చుకి కత్తెర వేసేదేగాని ఆ రోజు తనూ, నేనూ ఊహాలోకంలో విహరిస్తున్నాం. వెధవ డబ్బుదేముంది? కుక్కను కొడితే రాలుతుంది, అటువంటి సామెతలు మనసులోనే అనుకున్నా.

ఆనాటి రాత్రి సుప్రియ నా ఒళ్ళో తలపెట్టుకుని పడుకుని ఉండగా అడిగిన కోర్కె "నాకో ఎర్ర రాయి ఉంగరం కావాలండీ" అని.

"దాందేవుంది? రేపే కొనేద్దాం" అన్నా.

"మీరెంత మంచివారండి?" అంది సుప్రియ నిదానంగ.

"అబ్బ! పెళ్ళైన ఇన్నాళ్ళకు నన్ను మంచివాడని ఒప్పుకున్నావు. ఈ జన్మ కిది చాలు" అన్నా నాటకీయంగా.

సుప్రియ మాట్లాడలేదు. మౌనంగా కళ్ళుమూసుకుని పడుకుంది. ఆ ముఖంలో అలసట ఉంది. సంతృప్తి ఉంది. ఆ బ్రహ్మ సృష్టిలో నేనూ భాగం పంచుకుంటున్నానన్న ధీమా ఉంది. అలానే ఎంతసేపుండిపోయామో తెలీదు. నా మనసులో మెదిలిన భావం కృష్ణ శాస్త్రి పాతలానే ఉంది. "సడిసేయకో గాలి...." అని.

ఓ రెండు రోజుల తర్వాత జ్యుయెలరీ షాపుకు వెళ్ళి ఎర్రరాయి ఉంగరం కొన్నాం. ఐదువేలయింది. అది నెలాఖరు. కానీ నా ఫ్రెండు దగ్గిర అప్పుతీసుకున్నా. తిరిగి జీతాలు రాగానే ఇచ్చేస్తానని చెప్పా. అతనూ నాలాంటివాడే కానీ ఇంకా పెద్ద సంసారస్తుడు. పైగా

మర్యాదస్తుడు. నేను ఎప్పుడూ అప్పులు ఇవ్వను, చేయను. ఇప్పుడూ అప్పుచేశానన్న సంగతి ఎవరికీ తెలియకూడదని నా ఉద్దేశం. అతనైతే గుంభనగా ఉంటాడు. కనుకే అతని దగ్గిరే అప్పుతీసుకున్నాను.

సుప్రియ ఆ రోజే ఆ ఎర్రరాయి ఉంగరం వేసుకోలేదు. నేను రెట్టిస్తే "మరో నాల్రోజులు పోయాక వేసుకుంటానండి" అంది. "ఏమిటి ఆ రోజు స్పెషాలిటి? అంటే "ఆ రోజు మన మ్యారేజ్ ఆనివర్సరీ కదా" అంది కాస్త విసుగ్గా.

"చూడూ, ఇటువంటివి నాకు గుర్తు ఉండవు, నన్ను క్షమించు" అన్నా నొచ్చుకుంటూ.

"సరే క్షమించాలెండి" అంది సుప్రియ నవ్వు దాచుకుంటూ.

"అది సరేకానీ, ఉంగరం తాలూకు ఐదువేలూ అప్పేగా" అంది సుప్రియ భారంగా.

ఎందుకో ఒక్కసారి వాతావరణం బరువెక్కినట్టనిపించింది. "చూడు సుప్రియా, నువ్వా మాట ఎత్తొద్దు. అప్పో, సప్పో, కోరక కోరక నువ్వు అడిగితే ఆ ఉంగరం కొనలేనా? నువ్వడిగితే అప్పేం ఖర్మ, దొంగతనం చేసైనా తెస్తా, సరేనా?"

"రెండోది మాత్రం ఖచ్చితంగా చెయ్యరు" అంది సుప్రియ నిబ్బరంగా.

"ఏం? నా ప్రేమనే శంకిస్తున్నావా? అమాయకురాలా?" అన్నా హీరో ఫోజులో.

సుప్రియ నవ్వేసి "అది కాదు బడుద్ధాయిగారూ. మీకసలు దొంగతనం చేసేటంత తెలివితేటల్లేవని నా నమ్మకం" అంది.

"అలా ఎందుకంటావ్? ఏం? నేను నీ మానసచోరుణ్ణి కానా? అది దొంగతనం చేశానా లేదా?" అన్నా ఉత్సాహంగా రెట్టిస్తూ.

"అదేమోకానీ పెళ్ళికి ముందు తమరు పెద్ద పనిదొంగ అని మాత్రం బాగా తెలుసు" అంది సుప్రియ. తర్వాత " పరాచికాలు చాలు. లేవండి భోజనానికి" అంటూ వంటింట్లోకి వెళ్ళింది.

మా భోజనాలు ఐపోవస్తుండగా తలుపు చప్పుడైంది. సుప్రియే వెళ్ళి తలుపు తీసింది. "మీరా? ఇదేనా రావడం? కులాసానా?" అని తను అడగడమూ "అంతా కులాసే" అని మా చెల్లి బదులు చెప్పడమూ వినబడింది. ఆదరాబాదరాగా చెయ్యి కడుక్కుని ముందు హాల్లోకి వచ్చాను.

కుర్చీలో కూర్చుని తీరిగ్గా న్యూస్ చూస్తున్నారు మా బావగారు.

మొహం మీద నవ్వు పులుముకుని "ఏంటి విశేషం? అనుకోకుండా వచ్చినట్టున్నారే?" అన్నా.

తర్వాత చెల్లి చెప్పింది: బావగారికి అకస్మాత్తుగా ఆఫీసులో ఏదో ట్రైనింగ్ ప్రోగ్రాం వచ్చిందట. సొంత ఊరేగనక తనూ అన్నయ్యని చూస్తానంటూ బయల్దేరిందట.

సుప్రియ వంట గదికేసి వెళ్ళబోతోంటే "ఇప్పుడేం వద్దు. మా భోజనాలు హోటెల్లో ముగించుకునే వచ్చాం" అన్నారు మా బావగారు.

మనసులోనే అబ్బ. రక్షించావు అనుకున్నాను. అందరం కబుర్లలో పడిపోయాం.

మా బావగారికి ట్రైనింగ్ ఐదురోజులే అట. ఆఖరి రోజు హాఫ్‌డే గనుక త్వరగా వచ్చేసారు. ఆ రాత్రికే తిరుగు ప్రయాణానికి టికెట్స్ బుక్ చేసేశామన్నారు. కనుక నేనూ కాస్త త్వరగా తెమిలి ఇంటికి వచ్చా. సుప్రియ తనెప్పుడో తెచ్చుకుని కుట్టించుకోకుండా పెట్టుకున్న రవిక గుడ్డ తాంబూలంలో పెట్టి చెల్లెలికిచ్చింది. కుర్చీలో కూర్చున్న మా బావగారి దృష్టి తాంబూలం మీద పడనే పడింది.

"ఇప్పుడంతా జాకెట్ పీసులతో ముగించేస్తున్నారుగానీ మా ఫామిలీస్‌లో ఇలా కాదోయ్. మొన్న మా సిస్టర్ నాగూర్ నుంచి వచ్చింది. ఓ సిల్క్ శారీ కొన్నా తనకోసం. ఆరువేలైందనుకో. కాని అది నాకోసం అంత దూరం వచ్చినప్పుడు, అది నోరు తెరిచి అడగకపోయినా నా మనసు ఒప్పలేదోయ్. అల్లా అని ఇప్పుడు ఇక్కడ ఫార్మాలిటీసేవీ పెట్టుకోకండి. మా సిస్టర్ కూడా మీ సిస్టర్‌లాగే

అభిమానవంతురాలు. ఏమీ నోరు తెరిచి అడగదు. అయినా ఆడవాళ్ళకి పుట్టింటి మీద మోజుపోతుందా? ఇప్పుడు తన ట్రైన్ చార్జీలే అయిదారొందలైందనుకో. పైగా ఇక్కడ మా ఫ్రెండ్స్‌ందరూ ఆఖరి రోజుగా. ఈ రోజు పార్టీ పెట్టుకుందాం అని మరో ఐదువందలు వదిలించారు." ఆయన వాగ్ధాటి ప్రవాహంలా సాగిపోతుంది.

మా చెల్లి మొహం రంగుల మారుతోంది. సుప్రియ గంభీరంగానే ఉంది. ఎక్కడ తను నొచ్చుకుంటుందో అని భయపడ్డా. మా బావగారి లాజిక్కుకూ ఆయన ఇస్తున్న హింట్స్‌కూ నా మతి పోతోంది. కాని ఇంకో గంటలో తెమిలి వెళ్ళిపోతారు కనుక మాట్టాడకుండా ఉంటే సరి అనుకుని "బావగారూ, అన్నట్టు ఈ ట్రైనింగ్ వల్ల మీకేమన్నా ఎక్స్ట్రా ఇంక్రిమెంట్స్ ఏమన్నా వస్తాయా?" అని ఓ అర్థం పర్థంలేని ప్రశ్నలడిగి టాపిక్ మార్చడానికి ప్రయత్నించాను.

సుప్రియ "ఒక్క క్షణం ఆగు, గాయత్రీ" అని లోపలకు వెళ్ళింది. అడగక అడిగి చేయించుకున్న ఆ ఎర్రరాయి ఉంగరాన్ని తీసి గాయత్రి వేలికి తొడుగుతూ అంది "అన్నయ్యగారు సంప్రదాయం అనగానే గుర్తొచ్చిందామ్మా. నా మతిమరుపు మండిపోను. ఈయన నీమీద బెంగ పెట్టుకున్నారు. మొన్ననే ఈ ఉంగరం తెచ్చారు. ఊరెళ్ళి మా చెల్లెలికివ్వాలి అంటూనే ఉన్నారు. కానీ నేనే మరచిపోయాను" అని చులాగ్గా అనేసింది.

గాయత్రి విసురుగా చెయ్యి వెనక్కు తీసేసుకుంది. "ఇదేంటి వదినా? తాంబూలం ఇచ్చావు చాలు. నాకసలు ఎర్రరాయి ఉంగరం ఇష్టంలేదు. నాకారంగు అచ్చి రాదు. ఇటీవలే ఓ జ్యోతిష్కుడు చెప్పాడు" అంది. మేమిద్దరం తన ఎదురుగా లేకుంటే బావగారితో దెబ్బలాడేసేదేమో?

కానీ సుప్రియ "చూడు గాయత్రీ. ఈ ఉంగరం మీ అన్నయ్య ఇస్తున్నది కాదు. నేనిస్తున్నది. నేను నీకంటే వయసులోనూ, వరసలోనూ కూడా పెద్ద. ఉంగరం తీసుకోకుంటే నా మీద ఒట్టే" అంటూ బలవంతంగా ఉంగరం గాయత్రి వేలికి తొడిగేసింది.

నేను కూడా "తీసుకో గాయత్రీ" అన్నా. ఇంకేమనడానికి తోచలేదు. సుప్రియ మీద గొంతు దాకా కోపం వచ్చింది. ఏమిటి ఈ అభిమానధనురాలి ఉద్దేశం? పదిహేనువేల జీతగాడు తన భార్యకు ఓ ఉంగరం చేయించలేడా? అది నా బోటి ఆరువేల జీతగాడు కొనివ్వాలా? నా మనస్సు పరిపరివిధాల పోయింది.

మా బావగారు అందుకున్నారు. "ఏయ్, గాయత్రీ, వద్దని అలా మంకుపట్టు పడతావేం? వాళ్ళేమన్నా పరయివాళ్ళా? వాళ్ళంతా అభిమానంతో, ఆప్యాయతతో ఇస్తున్నారు? అదటుంచి పెద్దవాళ్ళు ప్రేమతో ఇచ్చింది తీసుకోకపోతే చిన్నవాళ్ళకు శ్రేయస్కరం కాదు. మీ అన్నా, వదిన అంతగా నిన్ను బతిమలాడి ఉంగరం తొడుగుతున్నారు, వద్దనొద్దు" అన్నారు నవ్వుతూ.

నేను తెప్పరిల్లాను. "గాయిత్రి, ప్లీజ్, నాకోసం వద్దు, సుప్రియకోసమైనా తీసుకో" అన్నాను దృఢంగా.

గాయత్రి ఏమీ అనకుండా పెంకులాంటి మొహంతో ఉంగరం తొడిగించుకుంది. తర్వాత ఓ అరగంట యధాలాపంగా మాట్టాడాము. కానీ ఈ సంభాషణలో ఉత్సాహంగా పాల్గొన్నది మా బావగారొక్కరే. సుప్రియ నిబ్బరంగానే మాట్లాడుతోంది. చెల్లీ, నేనూ ఔను, ఔనౌనులాంటి మాటలతో సరిపెట్టాం.

ఎలాగయితేనేం రాత్రి తొమ్మిది గంటలకు బావా చెల్లి బయలుదేరారు. చెల్లి కళ్ళలో నీళ్ళు చెలియలికట్ట దాటలేదు. మా బావగారు చూడకుండా ఏవో సైగలు చేయడం నేను గమనించాను. కానీ ఏం చెప్పను?

ఆఖరుకు సుప్రియే కలగజేసుకుంది. "గాయత్రీ, ఏం? మేం అక్కడకి రావాలా, వద్దా? అక్కడ కూడా ఇలా పరధ్యానంగా ఉంటే ఒప్పుకోను" అంది నవ్వుతూ.

గాయత్రి ఏమనుకుందో ఏమో, తర్వాత పదినిమిషాలు బాగానే మాట్టాడింది. సుప్రియ గలగలా మాట్లాడుతూ అప్పగింతలు చెప్పింది.

వాళ్ళను ట్రైన్ ఎక్కించి వచ్చేసరికి పదిన్నర దాటింది. సుప్రియ గుమ్మంలోనే ఎదురుచూస్తోంది. వచ్చీరాగనే "సుప్రియా, నీతో మాట్టాడాలి" అన్నా కటువుగా.

నిట్టూర్చింది సుప్రియ. "ఏమిటి?" అంది.

"చూడూ, మా బావగారి మాటతీరే అంత. అసలు ఆయన గురించి నీకెన్నిసార్లు చెప్పాను. అసలు ఆ ఉంగరం ఖరీదెంతనుకున్నావు? నా నెలజీతంలో దాదాపు సరిసగం. అసలా ఉంగరాన్ని బయటకెందుకు తీశావు? నువ్వు అడగక అడగక అడిగితే మురిపెంగా మొదటి బహుమతిగా కొన్న ఉంగరం అది, ఆ ఉంగరాన్ని ఇవ్వడానికి నీ మనసెలా ఒప్పింది?" అన్నానావేశంగా.

సుప్రియ మాట్లాడలేదు.ఒక్క క్షణం తన ఆలోచనల్ని కూడగట్టుకుంటున్నట్టుగా ఆగింది.

"అసలు మీరు మీ బావగారి మాటలు విన్నారా? పైగా గాయత్రికి కూడా మూడోనెలట. ఇంకా వాళ్ళాయనతోనూ చెప్పలేదట. నాతో చెప్పింది. మీక్కూడా ఇప్పుడిప్పుడే చెప్పాద్దంది. వాళ్ళాయన సంప్రదాయాల గురించి సాద మొదలు పెడితే, తాహతుకు మించి ఏమన్నా ఖర్చుపెట్టి తర్వాత ఇబ్బందుల్లో పడతారని చెప్పాద్దంది. అటువంటి చెల్లెలు ఉందికదాని గర్వపడక ఉంగరం పెట్టానని నన్ను నిలదీస్తున్నారా?"

ఒక్క క్షణం ఆగింది సుప్రియ.

"అసలు ఆ ఉంగరం తీసుకోవడానికి గాయత్రి ఎంత బాధపడిందో చూశారుగా? ఒట్టేస్తే గానీ తీసుకోలేదు. ఆఖర్న మీరిద్దరూ సామాన్లు ఆటోలో పెడుతున్నప్పుడు 'ఇది నువ్వే ఉంచేసుకో వదినా, మా వారితో రైల్లోనో, దారిలోనో ఎక్కడో జారిపోయిందని చెప్పేస్తా. మహా అయితే నాలుగు రోజులు తిట్టి, సాధించి ఊరుకుంటారు అంతేగా', అనికూడా అంది. అటువంటప్పుడు, నేను చేసిన పని తప్పంటారా."

నేనేమీ మాట్లాడలేకపోయాను. అవును, సుప్రియ గురించే ఆలోచిస్తున్నాను గానీ, గాయత్రి ఎంత బాధపడిందో? మా బావగారు కాస్త ప్రసన్నుడయి ఉంటాడు. ఈసారి చెల్లిని ప్రసవానికి పంపడానికి ఏ నెపాలూ పెట్టడు. అని రిలీఫ్‌గా ఫీలయ్యాను.

అప్పటికే పొద్దు పోయింది. తన ఒళ్ళో తలపెట్టుకుని పడుకున్నా. నా తల నిమురుతున్న సుప్రియ నా చేతిని నా చేతిలోకి తీసుకున్నా. పొడుగాటి, తెల్లటి, సనన్ని వేళ్ళు, ఏ కుంచెకో, వీణకో ప్రాణం పోయాల్సిన వేళ్ళు. వీటిలో ఒక వేలికి కూడా ఉంగరం తొడగలేకపోయాను. నా పదివేల జీతంపైనా, నా మిడిల్ క్లాస్ బతుకుపైనా, పైగా నాలుగైదేళ్ళుగా ఉద్యోగం చేస్తూ కూడ, ఒక ఉంగరం కొనేంతయినా వెనకేసుకోలేని నా నిర్లక్ష్యంపైనా పట్టరాని కోపం వస్తోంది.

"ఏమిటండి, ఇంకా ఆ ఉంగరం గురించే ఆలోచిస్తున్నారా? నేనెప్పుడో ఆ సంగతి మర్చిపోయాను. మీరూ అంతే. మళ్ళీ అప్పూ, గిప్పూ అంటూ వెర్రి చేష్టలు చేయకండి. అసలు ఆ అప్పు తీర్చింతర్వాత ఇంక దేనికి అప్పు చేయకూడదు. సరేనా" అంది సుప్రియ లాలనగా.

"సరే" అన్నా నిస్సారంగా.

"ఏమిటండీ, అలా డీలా పడిపోతారు" అంది సుప్రియ.

ఒక్క క్షణం నేను మాట్టాడలేదు. "చూడు సుప్రియా. రేపు ఆఫీసుకి లీవు పెడతాను. వేరే మా ఫ్రెండ్స్ దగ్గిర వడ్డీకైనా సరే అప్పు తెస్తాను. రేపు అదే షాపుకు వెళ్ళి అలాంటి ఎర్రరాయి ఉంగరమే తప్పక కొనాలి. నా మాట కాదనకు" అన్నా.

సుప్రియ కాస్త విసుక్కుంటున్నట్టుగా మాట్లాడింది. "ఏమిటండీ చాదస్తం. ఒకే నెలలో ఇన్నివేలు అప్పుచేసి ఏం తింటాం. పైగా, ఇక మీదట రెగ్యులర్‌గా చెకప్ చేయించుకోవాలి. మీ చెల్లి ఇంకొన్ని నెలల్లో ఇక్కడికి వస్తే అప్పుడు ఖర్చులుంటాయి. కాస్త ఆలోచించండి." అంది.

"చూడు సుప్రియా, నాకు కోపం తెప్పించకు. నువ్వు వద్దంటే నేనే ఆ ఉంగరాన్ని నా వేలికి తొడుక్కుంటా. కానీ రేపెలాగయినా ఆ ఉంగరం కొనాల్సిందే. ఇక మారు మాట్టాడకు" అన్నా.

"సరే, మహానుభావా. మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోండి. ఇప్పుడూ మాత్రం నన్ను కాస్సేపు నిశ్చింతగా పడుకోనివ్వండి. బాబూ" అంది సుప్రియ అటు వైపు తిరిగి పడుకుంటూ.

నాకు మనస్సు చివుక్కుమంది. నేనేం తప్పు చేశానని.

రేపెలాగయినా సరే, ఆ ఉంగరం సుప్రియ వేలికి తొడగాల్సిందే అనుకున్నాను. నేనూ అటు తిరిగి పడుకున్నాను. కలతనిద్రపట్టింది.

పొద్దున్నే సుప్రియ తట్టి లేపుతుండగా మెలుకువ వచ్చింది. "లేవండీ, బారెడు పొద్దెక్కింది. లేవండి" అంటూ తట్టి లేపుతోంది సుప్రియ.

"ఇవ్వాళ ఆఫీసుకి లీవని చెప్పాగా" అన్నా విసుగ్గా నిద్ర మత్తుతో అటువైపు తిరిగి పడుకుంటూ.

సుప్రియ నా భుజాలపై చేతులు వేసి లేపి బలవంతంగా కూర్చోబెట్టింది.

కోపంగా ఏదో అనబోయేంతలో వెనకనుంచి తన రెండు చేతుల్తోనూ నా కళ్ళు మూసి "దొరవారూ, కాస్త వ్యవధిగా నే చెప్పేది వింటారూ" అంది గోముగా.

నా మత్తంతా వదిలిపోయింది. "ఏమిటి కళ్ళకు గంతలు? నువ్వనేదేమిటి? ఆ ఎర్రరాయి ఉంగరం వద్దనేగా?" అన్నాను చిరాగ్గా.

సుప్రియ అంది. "నేనెందుకలా అంటాను మహానుభావా? అసలు మనింట్లో ఎర్రరాయి ఉంగరం లేకపోతేగా, మనం దాన్ని అంగట్లో కొనుక్కోవడానికి?"

" ఏమిటి చమత్కారం? మనింట్లో నిజంగా ఎర్రరాయి ఉంగరం ఉందా? నన్ను మభ్యపెట్టాలని చూడకు" అన్నా.

సుప్రియ అంది "ఎర్రరాయి ఉంగరం కాదు, దొరగారూ, ఉంగరాలు అనాలి. నా దగ్గరే ఉన్నాయి"

నాకు కోపం హెచ్చింది. "నా కళ్ళకు గంతలు కట్టి తీరిగ్గా పొడుపు కథలు చెపుతున్నావా? ఎక్కడవి? ఉంటే చూపించు" అన్నా.

"అంత తేలిగ్గా వచ్చేస్తాయా? ఓపిక పట్టండి మరీ" అంటూ నా దగ్గరకు వచ్చి "ఇదిగో ఆ ఉంగరాలు" అంటూ తన రెండు చేతులూ చాపింది.

"ఇవా ఎర్ర రాయి ఉంగరాలు?" అన్నా ఆశ్చర్యంగా.

"మరే. రాత్రి అవతల పక్కకి తిరిగి ఎందుకు పడూకున్నాననుకున్నారు? గాయత్రి ఊరినుంచి గోరింటాకు పొడి తెచ్చిచ్చింది. రాత్రంతా ఈ పొడి రాలకుండా, బాగాపండటానికి ఎంత కష్టపడ్డానో తెలుసా?" అండి సుప్రియ కళ్ళు తిప్పుతూ.

"సుప్రియా, ఈ గోరింటాకు పూత చూపించి నా అసమర్ధతను ఎత్తి..."

సుప్రియ తన చేతితో నా నోరు మూసేసింది.

"మహానుభావా, లేడికి లేచిందే పరుగా? నిన్న రాత్రి నే చెప్పిందంతా మర్చిపోయారా? నాకీ ఎర్రరాయి ఉంగరాలే చాలు" అంది తన చేతుల్ని మురిపెంగా చూసుకుంటూ.

"సుప్రియా, నువ్వు నిజంగా నా పాలిటి..."

నన్ను తన చేతులతో వారిస్తూ అంది సుప్రియ. "ఇక చాలు ఈ స్తోత్ర పాఠాలు. లేవండి. ఇవాళెలాగూ సెలవేగా. ఈ రోజు మన పెళ్ళి రోజు కూడానూ పదండి. అలా గుడివరకూ వెళ్ళొద్దాం."

"సుప్రియ, గుడికెందుకూ? ఈ దేవత నా గుండెల్లో ఉండగా? ఎలా ఉంది మన కవిత్వం?" అన్నా ఎర్రగా పండి మెరుస్తోన్న తన రెండూ చేతులనూ నా బుగ్గలకు ఆనించుకుంటూ.

"కవిత్వం బాగనే ఉందిగానీ అదే వేటూరి తర్వాత ఏవన్నాడూ? గుడిలోని దేవతను గుండెల్లో కలుసుకోమన్నాడు. మీరివాళ గుండెల్లోని దేవతను గుడికి తీసుకెళ్ళండి చాలు" అంది సుప్రియ.

అంకితం: నా ఈ చిన్ని ప్రయత్నానికి స్ఫూర్తినిచ్చిన రమణీయ సన్నివేశాల రూపకర్త సినీ దర్శకులు శ్రీ బాపుగారికి చంద్రుడికో నూలుపోగులా గౌరవాదరాలతో.